# తెలుగు వెలుగులు

## కేసీఆర్ (భాషా ప్రేమికుడు)

ఉద్యమకారుడిగా, రాజకీయవేత్తగా, దార్శనికుడిగా పేరుతెచ్చుకొన్న కేసీఆర్‌లో ఓ గొప్ప సాహితీవేత్త, తెలుగు భాషాభిమాని, రచయిత, కవి, వక్త ఉన్నారు. ఛలోక్తులు విసరడంలో ఆయన దిట్ట. అధ్యయన శీలి. 2017లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ప్రారంభోత్సవంలో ఆయన చేసిన ప్రసంగం నభూతో. అమ్మ ఒడే మొదటి బడి అని, అమ్మ భాషే జీవన గమనానికి పునాది అనీ నమ్మిన వ్యక్తి ఆయన. కేసీఆర్ తెలుగు భాషా వికాసానికి ఎంతో కృషి చేశారు. పన్నెండో తరగతి వరకు తెలుగు తప్పనిసరి చేశారు. తన ప్రసంగాల్లో అమ్మ భాషలోని నుడికారాల్ని ముత్యాల్లా ఏరుకోవచ్చు. ప్రత్యర్థులకు సామెతలతో చురకలు అంటించడంలో దిట్ట. అవన్నీ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోనే ఉంటాయి.





## పీవీ నరసింహారావు (భాషోద్ధారకుడు)

తెలుగు భాష అభివృద్ధికి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కృషి అపారం, అనన్యం. భద్రిరాజు కృష్ణమూర్తితో కలిసి తెలుగు అకాడమీ ఏర్పాటులో కీలక భూమిక పోషించారు. అకాడమీకి తొలి చైర్మన్‌గానూ వ్యవహరించారు. అసెంబ్లీ సమావేశాల్లో తెలుగులోనే మాట్లాడి భాష ఔన్నత్యాన్ని ఇనుమడింపజేశారు. ఆనాటి నాయకుల్లో చాలామంది ఉర్దూలోనే విద్యను అభ్యసించారు. ఇప్పుడు ఇంగ్లిష్‌కు ఎంతటి ప్రాధాన్యం ఉందో.. అంత గుర్తింపు, గౌరవం తెలుగు ఉపాధ్యాయులకు ఉండేది. కాలక్రమేణా తెలుగు తన ప్రాభవాన్ని కోల్పోసాగింది. ఆ సంధికాలంలోనే పీవీ తెలుగు భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. అందుకే, అకాడమీలతో అక్షరాలను దిద్దించి.. తెలుగు చదువులకు చలువ పందిళ్లు వేసిన భాషా స్వాప్నికుడిగా పీవీని అభివర్ణిస్తారు. సాహితీ తపస్విగానూ, కళా పిపాసిగానూ పీవీ చరిత్రకెక్కారు. కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 9, 2024న ‘భారతరత్న’ ప్రకటించి గౌరవించింది.

# సంక్షేమ రాజ్యం

## కేసీఆర్ (సంక్షేమానికి అగ్రస్థానం)

సీఎంగా ప్రమాణం చేసిన తొలిరోజు నుంచే కేసీఆర్ సబ్బండవర్గాల సంక్షేమానికి కృషిచేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా, గతంలో ఏ రాజకీయ పార్టీ చేపట్టని తీరులో కనీవినీ ఎరుగని రీతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, అనాథలు, లింగమార్పిడి వ్యక్తులు.. ఇలా సమాజంలోని ప్రతీ వర్గానికీ ఏదో ఒక లబ్ధి చేకూర్చే పథకాలను రూపొందించారు. ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, గురుకుల విద్యాలయాలు, సాగుకు ఉచిత విద్యుత్తు, గొర్రెల పంపిణీ, చేపల పంపిణీ, దళితబంధు, బీసీ–మైనార్టీలకు ఆర్థిక సాయం, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, రూ. 5కే భోజనం ఇలా దాదాపు 350కు పైగా సంక్షేమ పథకాలను తీసుకొచ్చారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా వెనుకడుగు వేయకుండా.. సమర్థంగా అమలు చేసిన ఘనత కేసీఆర్‌ది.





## ఎన్టీఆర్ (పేదలకు పెద్దపీట)

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో సంక్షేమ పథకాల ఆద్యుడిగా దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పేరు చెబుతారు. సంక్షేమ పథకాలకు కొత్త అర్థాన్ని ఇవ్వడమే కాదు.. వాటిని సమర్థంగా అమలు చేసి.. కాకలు తీరిన కురువృద్ధుల్నే ఆశ్చర్యపరిచారు. ఎన్టీఆర్ సంక్షేమ పథకాల లక్ష్యం ప్రజా క్షేమం ఒక్కటే. పేదవాడికి పథకంతో మేలు జరుగుతుందంటే చాలు.. దానివల్ల ఎన్ని కోట్ల రూపాయలు ఖర్చుచేయడానికైనా వెనుకంజ వేసేవారు కాదు. సీఎంగా ప్రమాణం చేసిన తర్వాత ఎన్టీఆర్ తీసుకొచ్చిన రూ.2కే కిలో బియ్యం పథకం, జనతా వస్త్రాల పంపిణీ , అన్నం-సాంబారు పథకం (అన్న క్యాంటీన్లు), 5 లక్షల ఇండ్ల నిర్మాణం పథకం, పటేల్ పట్వారీ విధానం రద్దు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం తదితర కార్యక్రమాలు పేదల అభిమానాన్ని చూరగొనడమే కాదు.. వారికి ఆర్థికంగా, సామాజికంగా ఎంతో భరోసానిచ్చాయి.